క్లుప్తంగా

ఓవరాల్ చాంపియన్‌గా బ్రింద బ్రెయిన్ గ్రూప్



గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న షటిల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. గుంటూరుకు చెందిన 110 మంది వైద్యులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు జాయింట్ కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి బహుమతులు అందజేశారు. నిత్యం రోగుల సేవలతో ఆస్పత్రుల్లో ఉండే వైద్యులకు ఇలాంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలినుంచి క్రీడా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలుస్తున్న బ్రింద బ్రెయిన్ గ్రూప్ ఓవరాల్ చాంపియన్‌సిప్ దక్కించుకుంది. ఓవరాల్ చాంపియన్‌సిప్ దక్కించుకున్న బ్రింద బ్రెయిన్ గ్రూప్ వైద్యులు భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, అయ్యప్ప, సత్యప్రవీణ్, కల్యాణ్, లక్ష్మణరావు, సుబ్బారెడ్డి, తేజ, ఆదిత్య, శ్రావ్య, లక్ష్మిలకు జాయింట్ కలెక్టర్ రాజకుమారి ట్రోఫీ అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సెక్రటరీ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జాన్‌షాహిద్, డాక్టర్ అస్లాం, డాక్టర్ సందీప్, డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

అరుదైన ఆపరేషన్ చేసి క్యాన్సర్ గడ్డలు తొలగింపు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ మూడో యూనిట్ జనరల్ సర్జరీ వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి క్యాన్సర్ గడ్డలు తొలగించి రోగి ప్రాణాలు కాపాడారు. సోమవారం జీజీహెచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉమ్మడి ప్రకాశంజిల్లా కందుకూరుకు చెందిన 66 సంవత్సరాల జి.లక్ష్మమ్మ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి గత ఏడాది నవంబర్ 10న వచ్చారన్నారు. లక్ష్మమ్మ కడుపు పెద్ద పేగులో కాన్సర్ గడ్డలు ఉండటంతో నవంబరు 29న ఆపరేషన్ చేసి గడ్డలు తొలగించామన్నారు. పెద్ద పేగు మొత్తం చిన్న చిన్న గడ్డలతో పాటు మల ద్వారంతోసహా పెద్ద గడ్డ ఉందని గుర్తించామన్నారు. రాడికల్ టోటల్ ప్రాక్టోకొలెక్టమి ఆపరేషన్ ద్వారా గడ్డలు తొలగించామని, ఇలాంటి ఆపరేషన్లు చాలా అరుదుగా జరుగుతుంటాయన్నారు. క్లిష్టమైన వైద్యం మూడు గంటల్లోనే చేశామన్నారు.

ప్రతి ఒక్కరికి.. అండగా ఉంటా

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 21వ డివిజన్‌లో 'మనతో మన రజినమ్మ'



కూరగాయలు విక్రయించే మహిళకు నమస్కరిస్తున్న మంత్రి విడదల రజిని, పక్కన శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జెండాను భుజానికెత్తుకుని.. పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేసే ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరగనివ్వనని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడే ప్రతి ఒక్కరికి.. తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 21వ డివిజన్ కేవీపీ కాలనీలో సోమవారం 'మనతో మన రజినమ్మ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తొలుత చుట్టుగుంట సెంటర్ నుంచి కేవీపీ కాలనీ ప్రధాన రహదారి మీదుగా లాలుపురం రోడ్డు వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీ జెండాను రెపరెపలాడించాలని కోరారు. నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు మాట్లాడుతూ నగరాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. నగరంలోని రోడ్ల రూపురేఖలన్నీ మార్చేస్తున్నామని పేర్కొన్నారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఎన్నో పనులను చేపట్టి పూర్తి చేస్తున్నట్లు వివరించారు. పశ్చిమ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేట్ గురవయ్య, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండలాల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ముందుకు సాగుదాం

కలిసికట్టుగా ముందుకు సాగుదాం.. భగవంతుడి ఆశీస్సులు.. ప్రజల దీవెనలు జగనన్నకు ఉన్నాయి.. వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. కొరిటెపాడులోని సాయిబాబా రోడ్డు సమీపంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షుల సమావేశం సోమవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పార్టీ నేతలు, కార్యకర్తలను కలుపుకుని వెళ్లే విషయంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, అధ్యక్షులు ఎంతో బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ నియోజకవర్గం అంటేనే ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో పార్టీ జెండాను నియోజకవర్గ నడిబొడ్డులో ఎగురేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. రానున్న ఎన్నికలు ఎంతో కీలకమని, ధర్మానికి.. అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధంగా ప్రతి ఒక్కరూ భావించి, ఎన్నికల పోరుకు సన్నద్ధులై ఉండాలని కోరారు. కుటుంబం అన్న తరువాత చిన్నపాటి విభేదాలు ఉండటం సర్వసాధారణమేనని, ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులంతా ఏకతాటిపై ముందుకు సాగాలని వివరించారు. ముఖ్యంగా డివిజన్ల పరిధిలో కార్యక్రమాలను విజయవంతం చేసే క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు బాధ్యతను తీసుకోవాలని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వాలు చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలందరికీ సంక్షేమాన్ని అందించారని చెప్పారు. ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు గేదెల రమేష్, సూరసాని వెంకటరెడ్డి, ఏరువ ఇన్నారెడ్డి, ఉడతా కృష్ణ, ఎండీ బాబుఖాన్, గుడిపాటి భాస్కర్, బత్తుల దేవానంద్, నూనె ఉమామహేశ్వరరెడ్డి, బందా రవీంద్రనాథ్, బైరెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



పట్నంబజారు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు గూడూరు నానిముదిరాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శాసనమండలి విప్, లేళ్ళ అప్పిరెడ్డి ఆవిష్కరించారు. బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అప్పిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వై.ఎస్.జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని కోరారు. నాని ముదిరాజ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలని బీసీలంతా ఏకగ్రీవంగా తీర్మానించుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, పార్టీ గుంటూరు క్లస్టర్– 4 అధ్యక్షుడు నూనె ఉమా మహేశ్వర రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, అన్నదాన సత్రం చైర్మన్ పోకల వసంత్, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు శ్రీనివాసరావు, బీసీ నేతలు పాల్గొన్నారు.

ఐక్యతతో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

- వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యూనియన్ నాయకులు

పాత గుంటూరు: విద్యుత్ ఉద్యోగులు ఐకమత్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో యూనియన్ గుంటూరు సర్కిల్ ఆధ్వర్యంలో 2024 డైరీ ఆవిష్కరణ సభ నిర్వహించారు. సభకు మహేశ్వర రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో యూనియన్ పటిష్టంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి అందరూ అండగా ఉండి అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా కృషి చేయాలని కోరారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్రస్థాయి సమావేశాన్ని గుంటూరు సర్కిల్ వారు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గుంటూరు సర్కిల్ రీజనల్ అధ్యక్షుడు షేక్ సైదా అలీ మాట్లాడుతూ గుంటూరు సర్కిల్లో విద్యుత్ ఉద్యోగులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. 2024 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.మల్లికార్జున రెడ్డి, గుంటూరు సర్కిల్ రీజనల్ కార్యదర్శి కె.వి.శివరామిరెడ్డి, నాయకులు బి.బాబు, డి.ఎస్.రాంగోపాల్, సుధాకర్ రెడ్డి, ఏ.వి.సత్యనారాయణ, లక్ష్మీరావు, బి.సోమశేఖర రెడ్డి, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం విక్రయించే వ్యక్తి అరెస్ట్



మాట్లాడుతున్న సెబ్ జిల్లా ఏఎస్పీ వెంకటేశ్వరరావు

నగరంపాలెం: తెలంగాణ మద్యం సీసాలను అధిక ధరలకు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గుంటూరు ఎస్ఈబీ(సెబ్) -2 పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.1.60 లక్షలు ఖరీదు చేసే 165 తెలంగాణ మద్యం సీసాలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్‌లోని సెబ్-2 స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్ఈబీ ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ కె.కర్ణతో కలసి కేసు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో నగరాలులోని టిలికం నగర్ ఒకటో వీధిలో అద్దెకుంటున్న పి.రామమోహనరావు ఇంట్లో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలను గుర్తించారు. ఈ మేరకు అతన్ని అరెస్ట్ చేసి రూ.1.60 లక్షల ఖరీదు చేసే 165 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. చాక్ పీస్‌లు తయారు చేసే అతను రైళ్లల్లో ప్రయాణించి, తెలంగాణ వెళ్లి మద్యం సీసాలను దఫాల వారీగా తీసుకువచ్చి ఇంట్లో భద్రపరిచేవాడు. అనంతరం వాటిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ కర్ణ, ఎస్ఐలు ఈ.కల్యాణ్‌చక్రవర్తి, ఎస్.హర్షవర్ధన్ రెడ్డి, హెచ్‌సీ కె.ప్రేమ్‌కుమార్, కానిస్టేబుళ్లు వీసీహెచ్ ఆంజనేయులు, కె.పూర్ణచంద్రరావు, డి.కోటేశ్వరరావు, సీహెచ్ ఆంజనేయులను ఏఎస్పీ అభినందించారు.

స్పందన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- నగర కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన కార్యక్రమం జరిగింది. తొలుత గత వారం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించి, కొన్ని విభాగాల అధికారులు ఫిర్యాదు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారని, ప్రజలు తిరిగి ఫిర్యాదుతో రీ ఓపెన్ చేస్తున్నారని, ఆ అర్జీలను విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫారసు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారుడికి సమాచారం అందించాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 41 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 12, ఇంజినీరింగ్ విభాగానికి 10, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 6, ఉపా సెల్ విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి, ఎస్ఈ (ఎఫ్ఏసీ) సుందర్‌రామిరెడ్డి, సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



జీకేఆర్ హైస్కూల్లో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి అందజేస్తున్న శైలజ



అభ్యుదయ కళాశాలలో భోగి మంట వద్ద విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రోహిణీదేవి



సుమేధ హైస్కూల్లో ప్రాంగణంలో భోగిమంట వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని జీకేఆర్ హైస్కూల్లో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విజేతలు ఎస్.విమల, సి.నాగసుధ, ఎం. తేజస్వికి పాఠశాల డైరెక్టర్ జి.కొండారెడ్డి, ప్రిన్సిపాల్ శైలజ బహుమతులు అందజేశారు. అదే విధంగా ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాఠశాల ప్రాంగణంలో భోగి మంట వేసి, విద్యార్థులకు భోగి పళ్లు పోశారు. హరిదాసులగానంతో ఆకట్టుకున్నారు.

అభ్యుదయ కళాశాలలో..

లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. రంగోలి, సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. పండుగ విశిష్టతలో భాగంగా భోగి మంటలు వేసి కోలాటం, గోమాత పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ బి.రోహిణిదేవి పాల్గొన్నారు.

సుమేధ హైస్కూల్లో..

ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి రంగ వల్లులు, బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో పాటు సంక్రాంతి లక్ష్మిగా అలరించారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కేఎల్‌పీ హైస్కూల్లో..

జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో అందమైన ముగ్గులు, భోగిమంట వేసి, హరిదాసుల గానం, బొమ్మల కొలువుతో పండుగ వాతావరణాన్ని తలపింపజేశారు. కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ వై.రధినీ చౌదరి పాల్గొన్నారు.



కేఎల్‌పీ హైస్కూల్ సంక్రాంతి సంబరాల్లో కృష్ణప్రసాద్, రధినీచౌదరి

నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్‌లో..

స్థానిక అరండల్‌పేటలోని నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు. ఇన్‌చార్జి వసంత లక్ష్మి పాల్గొన్నారు.

కెనడీ స్కూల్లో..అలరించిన సంబరాలు

అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల మెరిట్ క్యాంపస్‌లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసం, కోలాటం, గొబ్బెమ్మలను అలంకరణతో పాటు బొమ్మల కొలువు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె. శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఎన్.ఐజాక్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో..

బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ఇస్రో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావుతో పాటు యూఎస్ఏకు చెందిన ఎం.శివకుమార్, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కర్ రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం పాల్గొన్నారు.



కెనడీ మెరిట్ క్యాంపస్‌లో హరిదాసులు, గంగిరెద్దులను ఆడించే వారిగా విద్యార్థులు



ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో అతిథులతో విజయభాస్కర్‌రెడ్డి, అమీనాబేగం



నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్‌లో.. సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌ఓ వీరేంద్రబాబు

పట్నంబజారు: దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి పోలీసులు కోర్టుకు హాజరుపరిచారు. పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో సోమవారం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.వీరేంద్రబాబు, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శుభకార్యం జరుగుతున్న వేళ ఒక బ్యాగులో 129 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీన పట్టాభిపురం పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వీరేంద్రబాబు, ఎస్ఐ విజయ్‌కుమార్‌లు గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఇన్నర్ రింగురోడ్డులోని వెల్‌కమ్ హోటల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేయటంతో పారిపోయేందుకు చూశాడు. వెంటబడి పట్టుకున్న పోలీసులు సదురు వ్యక్తిని గుంటూరు నగరం మల్లికార్జునరావుపేటకు చెందిన షేక్ సైదుబాబు అలియాస్ సైదా అలియాస్ బాబుగా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా సిద్ధార్థ గార్డెన్స్ కల్యాణమండపంలో చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు నుంచి 129 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. నిందుతుడిని పట్టుకోవటంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐలు విజయ్‌కుమార్, పి.ఏకనాథ్, సిబ్బందిని డీఎస్పీ బి.ఉమామహేశ్వరెడ్డి, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్‌లు అభినందించారు.